సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం, 5, ఆగస్టు, 2024



పర్యాటక ధామం..
నేరెడుగొమ్ము మండలం వైజాగ్ కాలనీలో ప్రకృతి రమణీయ దృశ్యాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. - 8లో



శ్రావణం.. శుభప్రదం
వివాహాది శుభకార్యాలకు అనువైన శ్రావణ మాసం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. - 8లో



పడకేసిన పాలన
ప్రత్యేకాధికారుల పాలనలో నిధుల కొరత వల్ల గ్రామాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. - 9లో

న్యూస్‌రీల్

7న యాదాద్రీశుడి హుండీల లెక్కింపు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన నగదు, నగలును ఈ నెల 7వ తేదీన లెక్కించనున్నట్లు దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండ దిగువన ఉన్న సత్యనారాయణస్వామి వ్రత మండపం హాల్‌– 2లో ఉదయం 7 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని సూచించారు.

చేనేత వాక్‌ను జయప్రదం చేయండి

భువనగిరి టౌన్‌ : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈనెల 7వ తేదీ ఉదయం 9:30 గంటలకు భువనగిరి పరిధిలోని రాయగిరి క్రాస్‌ రోడ్డు నుంచి కలెక్టరేట్‌ వరకు చేనేత వాక్‌ నిర్వహించనున్నట్లు కలెక్టర్‌ హనుమంతు కే.జెండగే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాక్‌ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్‌ సమావేశం మందిరంలో చేనేత కళాకారులకు సన్మానం ఉంటుందన్నారు. చేనేత వాక్‌లో ప్రజాప్రతినిధులు, చేనేత సొసైటీల ప్రతినిధులు, అధికారులు, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నారసింహుడికి సంప్రదాయ పూజలు



శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : పంచనారసింహ క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వయంభూలకు ప్రభాతసేవ చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, తులసీఅర్చన చేశారు. అలాగే ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడుసేవను ఆలయంలో భక్తుల మధ్య ఊరేగించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

యాదాద్రి విద్యుత్‌ విభాగం ఈఈ సస్పెన్షన్‌

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని విద్యుత్‌ విభాగంలో ఈఈగా విధులు నిర్వహిస్తున్న రామారావును సస్పెండ్‌ చేస్తూ దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుత్‌ విభాగంలో 12 మందిని ఔట్‌సోర్సింగ్‌ ప్రాతిపదికన ఎలాంటి అనుమతులు లేకుండా నియమించారని గతంలో ఈఈపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈఓ విచారణకు ఆదేశించారు. ఆరోపణలు వాస్తవమని తేలడంతో రామారావును సస్పెండ్‌ చేసినట్లు ఈఓ తెలిపారు. ఆలయ ఈఓ, అనువంశిక చైర్మన్‌కు లెటర్‌ పెట్టకుండానే నిబంధనలకు విరుద్ధంగా సిబ్బందిని నియమించి మూడు నెలలుగా వేతనాలు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఆలయ నిధులు దుర్వినియోగం కావడం, నియమ, నిబంధనలను ఉల్లంఘించడంతో దేవస్థానం అనువంశిక చైర్మన్‌ బి.నర్సింహమూర్తితో చర్చించి ఈఈని సస్పెండ్‌ చేసినట్లు వెల్లడించారు.

హామీ ఇచ్చారు.. అమలు చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మిర్యాలగూడ : అధికారంలోకి వస్తే సీపీఎస్‌ను రద్దు చేసి ఓల్డ్‌ పెన్షన్‌ స్కీంను తీసుకువస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కోరారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.సీపీఎస్‌(కంట్రిబ్యూటరీ పెన్షన్‌ సిస్టం)తో ఉద్యోగులకు నష్టం జరుగుతుందని, తక్షణమే ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. 2023 సెప్టెంబర్‌1కి ముందు ఉద్యోగ నోటిఫికేషన్లు వచ్చి ఆ తరువాత నియమింపబడిన 2002, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్‌ విధానం వర్తింపజేయాలన్నారు. ఈ సమావేశంలో వెంకటేశం, శ్రీనివాసచారి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పాలనపై ఫోకస్‌

క్షేత్ర పర్యటనలతో ప్రజలకు చేరువగా కలెక్టర్‌



యాదగిరిగుట్ట బ్యాంకులో మహిళా రైతులను రుణమాఫీ వివరాలు అడుగుతున్న కలెక్టర్‌ (ఫైల్‌)



ఆత్మకూర్‌(ఎం)లో డ్రై డే గురించి గ్రామస్తులకు సూచనలు చేస్తున్న కలెక్టర్‌ (ఫైల్‌)

- కీలక అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు
- ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి చర్యలు
- అధికారులు, సిబ్బందిలో జవాబుదారీ తనం పెంపునకు ప్రయత్నం
- కట్టుతప్పిన ఉద్యోగులకు నోటీసులు

సాక్షి, యాదాద్రి : క్షేత్ర పర్యటనలు, సమీక్షలు, తనిఖీలు, కట్టుతప్పిన ఉద్యోగులకు హెచ్చరికలు చేస్తూ పాలనను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.. కలెక్టర్‌ హనుమంతు కే.జెండగే. పక్కా ప్రణాళికతో ముందుకెళ్తూ తన మార్క్‌ చూపుతున్నారు. పది నెలల క్రితం జిల్లా కలెక్టర్‌గా వచ్చిన జెండగే.. వరుస ఎన్నికలతో తీరికలేకుండా గడిపారు. ఎన్నికలు పారదర్శకంగా, విజయవంతంగా పూర్తిచేసేందుకు శాయశక్తులా కృషి చేశారు. అనంతరం పాలనపై ఫోకస్‌ పెట్టారు. ఇటీవల ప్రభుత్వ ఆదేశాలతో మరింత దూకుడు పెంచారు.

వీటిపై ప్రధాన దృష్టి

కార్యాలయంలో ఎక్కువ సమయం గడుపుతూ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లకుండా పాలన సాగించే పరిస్థితికి భిన్నంగా కలెక్టర్‌ ముందుకు సాగుతున్నారు. ప్రజలకు చేరువుగా, వారి సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు, పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటున్నారా.. మధ్యాహ్న భోజనం ఎలా ఉంది?, నీటి సరఫరా, పారిశుధ్యం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు.

విస్తృతంగా తనిఖీలు, సమీక్షలు

క్షేత్ర పర్యటనలో భాగంగా కలెక్టర్‌ విద్య, వైద్య, సంక్షేమం, అభివృద్ధిపై ప్రధాన దృష్టి సారించారు. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని సర్వేల్‌ గురుకులం, జిల్లా పరిషత్‌ హైస్కూల్‌, రామన్నపేట మండలం జనంపల్లి రెసిడెన్షియల్‌ బాలికల పాఠశాల, భూదాన్‌పోచంపల్లిలోని మార్కండేయనగర్‌, ఆలేరు మండలంలోని శారాజీపేటతో పాటు మరికొన్ని స్కూళ్లలో తనిఖీ చేశారు. సర్వేల్‌, రామన్నపేటలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూపై ఆరా తీశారు. కిచెన్‌, భోజనశాల, స్టోర్‌ రూం, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు వేశారు. బోధనతీరుపై ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతపై సూచనలు చేశారు.

- పల్లెలు, పట్టణాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పరిసరాలను పరిశీలిస్తున్నారు. ఇటీవల ఆత్మకూర్‌ (ఎం), ఆలేరు మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకున్నారు. సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. పారిశుద్ధ్యంపై పంచాయతీ సిబ్బందికి సూచనలు చేశారు.
- ఆరుగ్యారంటీలను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దరఖాస్తులు, ఆన్‌లైన్‌ నమోదులో లోపాలు ఉంటే సవరించి అర్హులందరికీ లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకుంటున్నారు. దరఖాస్తుదారులు ఉంటే లోపాలను సవరించాలని అధికారులను ఆదేశించారు.
- బీబీనగర్‌, ఆత్మకూర్‌(ఎం), రామన్నపేట, ఆలేరు, తుర్కపల్లి తదితర తహసీల్దార్‌ కార్యాలయాలకు వెళ్లి ధరణి దరఖాస్తులను పరిశీలించారు. ధరణి మోడ్యూల్‌లో ఉన్న అన్ని రకాల దరఖాస్తులను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.
- యాదగిరిగుట్ట మండలంలోని యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా, ఏపీజీవీబీ, భూదాన్‌పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లిలోని కెనరా బ్యాంకులను కలెక్టర్‌ సందర్శించారు. రుణమాఫీ జాబితాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి బ్యాంకుల్లో పొందిన రుణం, మాఫీ, రెన్యూవల్‌ వివరాల గురించి తెలుసుకున్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ, చిన్నారులకు విద్యావిధానంపై అంగన్‌వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆటపాటల ద్వారా విద్య అందించాలని, పిల్లల ఎత్తు, బరువును ప్రతి నెలా పర్యవేక్షించాలని సూచించారు.
- రుద్రవెల్లి వద్ద మూసీ నదిపై ఉన్న లో లెవల్‌ బ్రిడ్జిని పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున నీటి ఉధృతి పెరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు.

ప్రజాపాలన సేవా కేంద్రం

తనిఖీలు, సమీక్షలే కాకుండా కలెక్టర్‌ మరో కొత్త నిర్ణయం తీసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ పనుల నిమిత్తం, సమస్యలు విన్నవించి అర్జీలు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు వచ్చే బాధితులకు ఇబ్బందులు కలగకుండా, సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా పలు మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రధానంగా ఈ కేంద్రంలో ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలు చేస్తున్న పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నారు. అంతే కాకుండా వచ్చిన దరఖాస్తుల్లో తప్పులను సరిచేయడంతో పాటు దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేయనున్నారు.

ఆస్పత్రులకెళ్లి.. సేవలను పరిశీలించి

ప్రభుత్వ ఆస్పత్రులను విజిట్‌ చేస్తున్నారు. ఇమ్యూనైజేషన్‌, ఫార్మసీ, ఆపరేషన్‌ థియేటర్లు, ఇన్‌పేషెంట్లు రూంలు, మందుల స్టాక్‌ను పరిశీలిస్తున్నారు. రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీస్తున్నారు. బీబీనగర్‌ పీహెచ్‌సీలో విధులకు గైర్హాజరైన ఉద్యోగికి నోటీసులు ఇవ్వాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. అలాగే వైద్యాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తం చేస్తున్నారు. ఆస్పత్రుల్లో కాన్పులపై ఆరా తీస్తున్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్‌ (ఫైల్‌)

గర్భిణుల ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాలని వైద్యసిబ్బందికి సూచిస్తున్నారు.



తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువు

ముంపు ముప్పుండదు!

గంధమల్ల రిజర్వాయర్‌ సామర్థ్యం తగ్గింపు

- 4.28 టీఎంసీల నుంచి 1.5 టీఎంసీలకు కుదిస్తూ ప్రభుత్వ నిర్ణయం
- వీరారెడ్డిపల్లి, గంధమల్ల గ్రామాలకు తప్పిన ముంపు సమస్య
- త్వరలో భూసేకరణ పనులు ప్రారంభించే అవకాశం

సాక్షి, యాదాద్రి : గంధమల్ల రిజర్వాయర్‌ నిర్మాణానికి అడుగులు పడనున్నాయి. గ్రామాలకు ముంపు సమస్య లేకుండా రిజర్వాయర్‌ సామర్థ్యాన్ని 1.5 టీఎంసీలకు కుదించారు. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో త్వరలో భూసేకరణ చేపట్టే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

గతంలో ప్రాజెక్టు స్వరూపం ఇలా..

జిల్లాలోని తుర్కపల్లి మండలం గంధమల్ల చెరువును రిజర్వాయర్‌ చేసి ఆలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. ఆలేరుతో పాటు సిద్దిపేట జిల్లాలో 63 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో యాదాద్రి జిల్లాలో 62,000 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ –15లో గంధమల్ల రిజర్వాయర్‌ను 9.86 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని తొలుత నిర్ణయించారు. టెండర్లు ఆహ్వానించి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. అయితే పెద్దమొత్తంలో నీటిని నిల్వ చేయడం వల్ల తుర్కపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి, గంధమల్ల గ్రామాలు ముంపుబారిన పడుతుండడంతో ప్రజలనుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై అప్పట్లో ప్రతిపక్ష పార్టీలు కూడా ఆందోళనకు దిగాయి. దీంతో రిజర్వాయర్‌ పనులను అప్పటి ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టింది. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో గంధమల్ల రిజర్వాయర్‌ విషయాన్ని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ బీర్ల అయిలయ్య ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో మళ్లీ కదలిక వచ్చింది.

భూ సేకరణ వెయ్యి ఎకరాలలోపే..

రిజర్వాయర్‌ సామర్థ్యాన్ని1.5 టీఎంసీలకు తగ్గించడంతో భూ సేకరణ వెయ్యి ఎకరాలలోపే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొదట నిర్ణయించిన ప్రకారం 9.86 టీఎంసీల సామర్థ్యానికి 8వేల ఎకరాలకు పైగా సేకరించాల్సి ఉంది. ఇందులో ప్రధాన కాలువ డిస్ట్రిబ్యూటరీలకే 4,162 ఎకరాలు, రిజర్వాయర్‌ కోసం 4,027 ఎకరాలు అవసరం. అంతేకాకుండా గంధమల్ల, వీరారెడ్డిపల్లిలో సుమారు 1,600 ఇళ్లు ముంపుకు గురై సుమారు 1,568 కుటుంబాలు నిర్వాసితులయ్యే ప్రమాదం ఉండేది. అయితే ప్రజల నుంచి నిరసన వ్యక్తమవడం, హైటెన్షన్‌ విద్యుత్‌ టవర్ల తొలగింపునకు సాధ్యం కాకపోవడం వంటి కారణాలతో రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం 4.28 టీఎంసీలకు తగ్గించారు. దీంతో వీరారెడ్డిపల్లి ముంపు నుంచి బయటపడింది. అయితే గంధమల్లకు ముప్పు పొంచి ఉండడంతో ప్రాజెక్టు సామర్థ్యం ఇంకా తగ్గించాలని గ్రామస్తులు పట్టుబట్టారు. ప్రభుత్వం తాజాగా 1.5 టీఎంసీలకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడం ద్వారా గంధమల్ల గ్రామానికి కూడా ముంపు తగ్గినట్లుయ్యింది.

ఆలేరును సస్యశ్యామలం చేయడమే లక్ష్యం

గంధమల్ల రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యాన్ని 1.5 టీఎంసీలకు తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో గంధమల్ల, వీరారెడ్డిపల్లి గ్రామాలకు ముంపు సమస్య తప్పనుంది. త్వరలో పనులు ప్రారంభిస్తామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యం.

–బీర్ల అయిలయ్య, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్‌ బీర్ల అయిలయ్య

- ప్రభుత్వ విప్‌ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట : స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుని సత్తా చాటాలని ప్రభుత్వ విప్‌ బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. ఆలేరు, ఆత్మకూరు(ఎం), మోటకొండూరు, గుండాల మండలాలకు చెందిన 240 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను ఆదివారం యాదగిరిగుట్ట పట్టణంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ సర్పంచ్‌లు, ఎంపీటీసీలను గెలిపిస్తేనే గ్రామాలు మరింత పురోగతి సాధిస్తాయన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా అమలు చేస్తూ, ప్రజారంజక పాలన సాగిస్తుందన్నారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. త్వరలో రూ.2 లక్షల రుణమాఫీ చేయబోతున్నామని చెప్పారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, 15 రోజుల్లో లబ్ధిదారులను గుర్తిస్తామని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 40 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని పేర్కొన్నారు. ఈ నాయకులు కార్యక్రమంలో జనగాం ఉపేందర్‌రెడ్డి, ఈరసరపు యాదగిరి, నీలం వెంకటస్వామి, అశోక్‌, మండల శాఖ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మరువద్దు



మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

- సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

గుండాల : మనం ఏస్థాయిలో ఉన్నా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మరిచిపోవద్దని సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్‌తేజ పేర్కొన్నారు. ఆదివారం గుండాల మండలంలోని సుద్దాల గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌ దూడల సత్తమ్మ ఉద్యోగ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసిప్రాయంలో అక్కున చేర్చుకొని అక్షరాభ్యాసం చేయించిన ఘనత అంగన్‌వాడీ టీచర్లకు దక్కుతుదన్నారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకువచ్చి కన్నతల్లిలా గోరు ముద్దలు తినిపించి, చదువు చెప్పడం ఎంతో గొప్ప విషయమన్నారు. అనంతరం పాటలుపాడి అలరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ గడ్డమీది పాండరి, మాజీ ఎంపీటీసీ బడక మల్లయ్య, మాజీ ఉప సర్పంచ్‌ బత్తిని రవి, రిటైర్డ్‌ సీడీపీఓ సువర్ణ, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ యాకుపాషాబేగం, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

యాదాద్రిలో భక్తజన సందడి



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మాడ వీధుల్లో ఆదివారం భక్తుల రద్దీ

సాగర్‌.. నిండుకుండ



నీటితో కళకళలాడుతున్న సాగర్‌ జలాశయం

- జలాశయానికి భారీగా వరద
- 577.40 అడుగులకు చేరిన నీటిమట్టం
- నేడు క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

నాగార్జునసాగర్‌ : నాగార్జునసాగర్‌ జలాశయం నిండుకుండలా మారింది. ఎగువనగల శ్రీశైలం జలాశయం 10 రేడియల్‌ క్రస్ట్‌గేట్లను 15 అడుగులు ఎత్తి స్పిల్‌వే మీదుగా దిగువకు 3,69,250 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 58,461 క్యూసెక్కులు మొత్తం 4,27,711 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నాగార్జునసాగర్‌ జలాశయానికి వస్తోంది. సాగర్‌ గరిష్ట స్థాయి నీటిమట్టం 590.00 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా.. ఆదివారం రాత్రి 9 గంటలకు నీటిమట్టం 577.40 అడుగులకు (275.5168 టీఎంసీలు) చేరింది. నీటిమట్టం గరిష్టస్థాయికి చేరువ కావడం, వరద కొనసాగుతుండడంతో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు క్రస్ట్‌ గేట్లు ఎత్తి దిగువకు నీటికి విడుదల చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ జిల్లా కలెక్టర్‌ నారాయణరెడ్డి హాజరు కానున్నారు. నాగార్జునసాగర్‌ జలాశయం రేడియల్‌ క్రస్ట్‌గేట్లు ఎత్తి రెండు లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు ఎన్‌ఎస్‌పీ అధికారులు ప్రకటించారు.

రోజువారీగా నీటి నిల్వ పెరిగింది ఇలా..

తేదీ	పెరిగిన టీఎంసీలు
జూలై 25	0.3231
26	1.9526
27	2.6338
28	4.0072
29	4.0818
30	5.5536
31	12.9644
ఆగస్టు 01	17.3296
02	28.1368
03	31.0908
04	30.9492

కృష్ణాతీర ప్రాంత ప్రజలకు హెచ్చరికలు జారీ

సాగర్‌ రేడియల్‌ క్రస్ట్‌గేట్లనుంచి దిగువ కృష్ణానదిలోకి నీటిని విడుదల చేస్తున్న దృష్ట్యా నాగార్జునసాగర్‌ డ్యాం దిగువన నది వెంట గల తండాలు, గ్రామాల ప్రజలు, మత్స్యకారులకు ఆయా జిల్లాల కలెక్టర్లు హెచ్చరికలు జారీ చేశారు. ఆయా గ్రామాల కార్యదర్శులను గ్రామాల్లో చాటింపు వేయించాలని ఆదేశించారు. కృష్ణానదిలోకి పశువులు, జీవాలను తీసుకెళ్లవద్దని, ఈతకు వెళ్లొద్దని, నదిలోని మోటార్లను ముందస్తుగానే వెలుపలకు తెచ్చుకోవాలని, మత్స్యకారులు వలలను తీసుకోవాలని సూచిస్తున్నారు.

నీటిమట్టం..

జూలై 23వ తేదీ ఉదయం ఆరు గంటలకు నాగార్జునసాగర్‌ జలాశయం నీటిమట్టం 503.70 అడుగులు (121.2226టీఎంసీలు) ఉంది. 23వ తేదీ నుంచి శ్రీశైలం జలాశయంలో విద్యుదుత్పాదన ద్వారా సాగర్‌కు నీటిని వదిలారు. అప్పుడు సాగర్‌ నుంచి ఎడమ, కుడి కాల్వల పరిధిలో తాగు అవసరాలకు నీటిని విడుదల చేస్తుండడంతో వచ్చే నీటి కంటే విడుదల చేసే నీరు ఎక్కువగా ఉండడంతో 24వ తేదీ 0.161 టీఎంసీలు తగ్గింది. అదే రోజు ఎడమకాల్వకు నీటిని నిలిపి వేశారు. ఆ తర్వాత శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో రావడంతో 30వ తేదీన సాగర్‌ నీటిమట్టం 514.60 అడుగులుకు చేరంది. 31 ఉదయం ఆరుగంటలకు 521.80 అడుగులకు, ఆగస్టు 1వ తేదీన 530.90, 2వ తేదీనాటికి 544 అడుగులకు, 3వ తేదీన 558 అడుగులకు, 4వ తేదీన ఉదయం ఆరుగంటలకు 571 అడుగులకు నీటి మట్టం చేరింది.

ఆటోమెటిక్‌ మిషన్‌తో గేట్లు ఓపెన్‌

సాగర్‌ ప్రాజెక్టు రేడియల్‌ క్రస్టుగేట్లను ఆటోమెటిక్‌ మిషన్‌ ద్వారా ఎత్తనున్నారు. ఏ గేటు ద్వారా ఎంత నీరు వెళ్లాలో ఆటో మిషన్‌లో ఫీడ్‌ చేస్తే.. ఆ గేటు అంతే ఎత్తు లేస్తే అంతే నీరు బయటికి వెళ్తుంది. వెళ్లే నీరు స్క్రీన్‌పై కనపడుతుంది. గతంలోనే ఈ ఆటో మిషన్‌ను ఏర్పాటు చేయగా మరమ్మతులకు గురికావడంతో కొన్నాళ్లు మ్యాన్‌వల్‌గానే గేట్లు ఎత్తారు. ఈ ఏడాది మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇప్పటికే ఆటోమెటిక్‌ మిషన్‌ను ట్రయల్‌ రన్‌ నిర్వహించారు.

ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

భువనగిరిటౌన్‌ : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కార్మిక వర్గానికి ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్‌ చేశారు. ఆదివారం భువనగిరిలో జరిగిన ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్‌ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కనీస వేతన బోర్డు ఏర్పాటు చేసి కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని పేర్కొన్నారు. ఉద్యోగ, కార్మిక సంఘాలు ఈ ప్రభుత్వం మీద ఎన్నో ఆశలు పెట్టుకుని గెలిపించారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలని కోరారు. కార్మికులకు సీపీఐ అండగా ఉంటుందని, సమస్యల పై పోరాటాలు చేస్తుందన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్‌, ఉపాధ్యక్షుడు పిల్లి శంకర్‌, సహాయ కార్యదర్శులు గానబోయిన వెంకటేష్‌, సోమన సవిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోద శ్రీరాములు

క్లుప్తంగా

ఇసుక లారీలు సీజ్

కోదాడరూరల్: ఏపీ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను శనివారం రాత్రి కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలో ఎన్టీఆర్ జిల్లా నందిగామ ఇసుక ర్యాంపు నుంచి మూడు ఇసుక లారీలు రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్ మీదగా కోదాడ వైపు వస్తుండగా చిమిర్యాల క్రాస్‌రోడ్ వద్ద పట్టుకున్నారు. లారీలను సీజ్ చేసి డ్రైవర్లు షేక్ రసూల్, తాటి కొండల్‌రావు, ఓనర్లు షేక్ లత్రోజ్, పాములపాటి సీతారామయ్య, మహ్మద్ రఫీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



లారీ కిందకు దూసుకెళ్లిన కారు

చౌటుప్పల్: మున్సిపల్ పరిధిలోని లింగోజిగూడెం గ్రామం వద్ద జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. సీఐ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా వైరాకు చెందిన దొంతబోయిన నితీష్‌కుమార్‌తోపాటు అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి పడిమళ్ల వీరభద్రరావు(55) కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో తమ ముందున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ప్రమాద సమయంలో కారు అతివేగంగా ఉండడంతో ఎడమవైపున కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో కారు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి



చికిత్స పొందుతున్న మూడావత్ పర్వతాలు

డిండి: దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆది వారం డిండి మండల పరిధిలోని ప్రతాప్‌నగర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి లోని ప్రతాప్‌నగర్ గ్రామానికి చెందిన కేతావత్ పాలేక గత నెల 31వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే పాలేక మృతికి అదే గ్రామానికి చెందిన మూడావత్ పర్వతాలు కారణమని భావించిన మృతుడి కుటుంబ సభ్యులు కేతావత్ బిచ్చాల, శ్రీను, గణేష్, పవన్‌లు శనివారం అతడి ఇంటిపై దాడి చేశారు. దీంతో పర్వతాలుకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న బిషప్ ధమన్‌కుమార్

సూర్యాపేట: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఉమ్మడి నల్లగొండ జిల్లా నూతన పీఠాధిపతి (బిషప్) కరణం ధమన్ కుమార్ అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని ఆర్‌సీఎం చర్చిలో సెయింట్ జాన్ మేరీస్ మరియా గురు పూజోత్సవం సందర్భంగా దివ్యబలి పూజలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సూర్యాపేట విచారణ ఫాదర్ పసల మరియన్న, అరుళప్ప రెడ్డి, జోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ధామం.. ఉపాధికి ఊతం



కృష్ణా వెనుక జలాలు

- వైజాగ్‌కాలనీని తాకిన సాగర్ వెనుక జలాలు
- తరలివస్తున్న పర్యాటకులు
- చేపల వేటలో మత్స్యకారులు



వలలను సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

చందంపేట: నేరెడుగొమ్ము మండలంలోని వైజాగ్ కాలనీ ప్రకృతి రమణీయ దృశ్యాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడి ప్రాంతం ఓ వైపు పర్యాటకంగా ఆకట్టుకుంటూనే.. మరోవైపు మత్స్యకారులకు జీవనోపాధి లభిస్తోంది. రాష్ట్ర నలుమూలల నుంచి ఇక్కడ సరదాగా గడిపేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. దీనికి తోడు ఇక్కడ బోట్లలో కృష్ణా నీటిలో షికారు మరింత ఆకట్టుకుంటుంది. నాగార్జునసాగర్‌కు వస్తున్న ఇన్‌ఫ్లోతో కృష్ణా వెనుక జలాలు క్రమంగా పెరుగుతుండడంతో కృష్ణా జలాలనే నమ్ముకొని జీవనం సాగించే మత్స్యకారులు చేపలు పట్టే పనిలో బిజీ అయ్యారు.

పర్యాటకులతోనే మాకు ఉపాధి



మామూలు సమయాల్లోనే పర్యాటకులు వస్తుంటారు. ఇక ఆదివారం, సెలవు దినాల్లో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. పర్యాటకులు కచ్చితంగా ఇక్కడి చేపల రుచి చూసే వెళ్తారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో వచ్చి ఇక్కడి ప్రదేశాలను తిలకిస్తూ, బోటులో కృష్ణా వెనుక జలాల్లో విహరిస్తూ సరదాగా గడుపుతుంటారు. పర్యాటకుల తాకిడితో మాకు ఉపాధి లభిస్తుంది. కృష్ణా వెనుక జలాలను నమ్ముకొనే మా జీవనం సాగుతుంది.

– కారె లక్ష్మణ్, వైజాగ్ కాలనీ

వైజాగ్ కాలనీ టూ.. ముంబయి

వైజాగ్ కాలనీలో లభించే చేపలకు మంచి డిమాండ్ ఉంది. మార్కెట్లో డిమాండ్‌కు తగ్గట్టుగానే వైజాగ్ కాలనీలో లభించే చేపలు ముంబయి, కోల్‌కతాతోపాటు ఆంధ్ర ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలు, హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్స్‌కు వైజాగ్ కాలనీ చేపలు సరఫరా అవుతుంటాయి.

పోలీసుల నిఘా..

దేవరకొండ మీదుగా పోలేపల్లికి బస్సు ద్వారా చేరుకుంటే అక్కడి నుంచి నేరెడుగొమ్ము, పెద్దమునిగల్ మీదుగా వైజాగ్ కాలనీకి చేరుకోవచ్చు. కృష్ణా బ్యాక్ వాటర్ పెరుగుతుండడంతో పర్యాటకుల తాకిడి మొదలుకానుంది. ఈ క్రమంలో పర్యాటకులను అప్రమత్తం చేసేందుకు పోలీసులు నిఘా ఉంచారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1989–90వ బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 34ఏళ్ల తరువాత ఒక్కచోట కలుసుకున్నారు. పూర్వ విద్యార్థి, ప్రముఖ పారిశ్రామిక వేత్త షేక్ బొగ్గుల మౌలాలి ఆధ్వర్యంలో ఆదివారం కోదాడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా వారు తమకు పాఠాలు బోధించిన అప్పటి ఉపాధ్యాయులు యాదగిరి కోటయ్య, పందిరి ప్రతాపరెడ్డిలను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో గుండా బ్రహ్మారెడ్డి, ములకా సైదిరెడ్డి, దేవపంగు బాబు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

తిప్పర్తి: చదువుపై ఇష్టం లేక ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం అర్ధరాత్రి కేశరాజపల్లి సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం శేషమ్మ గూడెం గ్రామానికి చెందిన బొల్లెద్దు చందు (20) నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. శనివారం ఉదయం కాలేజీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి కేశరాజపల్లి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. తన కుమారుడికి చదువు ఇష్టం లేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి నగేష్ పోలీసులకు వివరించాడు.

గోవులు తరలిస్తున్న వాహనాల పట్టివేత

అనంతగిరి: హైదరాబాద్‌కు అక్రమంగా గోవులను తరలిస్తున్న రెండు డీసీఎంలు ఒక టాటాఏస్‌ను అనంతగిరి పోలీసులు ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఎస్‌ఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ సమీపంలో గల హనుమాన్ జంక్షన్ సంత నుంచి 141 ఆవు దూడలు హైదరాబాద్‌కు, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం నుంచి ఒక ఆవు దూడను కోదాడకు తరలిస్తున్నారు. శాంతినగర్ రహదారిలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వీటిని పట్టుకున్నారు. ఈ మేరకు ఎండీ జలీల్, శర్మ, పటాన్ వసీం ఖాన్, సంతోష్, వడ్లమూడి రాము, షేక్ మహమ్మద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆవు దూడలను హైదరాబాద్, మఠంపల్లి గోశాలకు తరలించినట్లు చెప్పారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. అతర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్‌స్వామి, గణపురం సరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, భక్తులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడి దర్శనానికి గంటన్నర సమయం



ఆలయ క్యూకాంప్లెక్స్ క్యూలైన్‌లో భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ ఆషాఢ మాసం చివరి రోజు, అందులోనూ అమవాస్య కావడంతో భక్తులు తక్కువ సంఖ్యలో శ్రీస్వామిని దర్శించుకున్నారు. దీంతో శ్రీస్వామి ధర్మ దర్శనానికి గంటన్నర సమయం, వీఐపీ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టింది. శ్రీస్వామివారిని 25వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీస్వామి వారి ఆలయంలో భక్తులు తక్కువగా ఉండటంతో ఆలయ మాడ వీధుల్లో సందడి కనిపించలేదు. ఇక సోమవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తుల రద్దీ పెరగనుంది. కాగా.. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.27,09,469 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పాతకక్షలతో వ్యక్తిపై కత్తితో దాడి

హుజూర్‌నగర్: పాతకక్షలు మనసులో పెట్టుకొని ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన ఆదివారం హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు రెండు నెలల క్రితం బూరుగడ్డకు చెందిన చింత నవీన్ మోటార్‌సైకిల్‌పై హుజూర్‌నగర్‌కు వస్తుండగా అదే సమయంలో నేరేడుచర్లలోని శివాజీనగర్ కాలనీకి చెందిన యడవెల్లి వరుణ్ పట్టణ శివారులో నవీన్ బండిని ఢీ కొట్టాడు. దీంతో నవీన్ వరుణ్‌పై చేయిచేసుకున్నాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న వరుణ్ ఆదివారం స్థానిక మిర్యాలగూడ రోడ్డులో గల బైక్ మెకానిక్ మధు ఫోన్‌తో నవీన్‌కు ఫోన్ చేసి హుజూర్‌నగర్ రమ్మన్నాడు. దీంతో నవీన్ తన స్నేహితులతో అక్కడికి వెళ్లగా వెంటనే వరుణ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో నవీన్‌పై దాడి చేశాడు. నవీన్ స్నేహితుడు గోపాలదాసు కిరణ్ విడిపించడానికి ప్రయత్నించగా అతనిపై కూడా దాడి చేసి గాయపరిచాడు. స్థానికులు బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూసీకి తగ్గిన ఇన్‌ఫ్లో



మూసీ రిజర్వాయర్

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. మూసీ ఎగువన ఉన్న హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో గత వారం రోజుల నుంచి వర్షాలు కురవడం లేదు. దీంతో మూసీకి గత మూడు రోజుల నుంచి 500 క్యూసెక్కులకు పైగా వస్తున్న ఇన్‌ఫ్లో ఆదివారం నాటికి కేవలం 60 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ఇన్‌ఫ్లో తగ్గటం, ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు నీటిని విడుదల చేస్తుండటంతో ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గిపోతుంది. 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టం గల మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం ఆదివారం సాయంత్రం 641.60 అడుగుల వద్ద ఉంది. మూసీ కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు 536 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సీపేజీ, లీకేజీ ఆవిరి రూపంలో 55 క్యూసెక్కుల నీరు వెళ్తుంది. మూసీ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.66 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

క్రెడిట్ కార్డు నుంచి రూ.80 వేలు స్వాహా

- మోత్కూరులో ఆలస్యంగా వెలుగులోకి..

మోత్కూరు: మోత్కూరుకు చెందిన ఓ వ్యాపారి క్రెడిట్ కార్డు నుంచి సైబర్ నేరగాళ్లు రూ.80 వేలు స్వాహా చేసిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన ఓ నూనె వ్యాపారి క్రెడిట్ కార్డు ద్వారా గత నెల 15న ఒకసారి రూ.40 వేలు, అదే రోజు రెండవసారి మరో రూ.40 వేలు మొత్తం రూ.80 వేలు సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. ఇటీవల మోత్కూరు ఎస్‌బీఐ బ్యాంకు సిబ్బంది వ్యాపారికి ఫోన్ చేసి క్రెడిట్ కార్డు నుంచి ఏమైనా డబ్బులు తీశారా అని ప్రశ్నించగా.. బాధితుడు అలాంటిదేమీ లేదని సమాధానం ఇచ్చాడు. దీంతో మీ క్రెడిట్ కార్డు నుంచి రూ.80 వేలు డ్రా అయ్యాయని బ్యాంకు అధికారులు తెలిపారు. దీంతో ఆ వ్యాపారి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

బస్సును ఢీకొట్టిన డీసీఎం

- డ్రైవర్‌కు తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం

కనగల్: మండల పరిధిలోని జి.చెన్నారం స్టేజీ వద్ద బస్సును డీసీఎం ఢీకొట్టడంతో డ్రైవర్, కండక్టర్‌తోపాటు పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. వివరాల ప్రకారం.. నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 30మంది ప్రయాణికులతో చండూరు–మాల్‌కు వెళ్తోంది. జి.చెన్నారం స్టేజీ వద్ద దేవరకొండ నుంచి నల్లగొండ పట్టణం వైపు వస్తున్న డీసీఎం బస్సును ఢీకొట్టింది. దీంతో కనగల్ మండలం దోరెపల్లి గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ ఎరుకల భిక్షంకు తీవ్రగాయాలయ్యాయి. కండక్టర్‌తో పాటు బస్సులో ప్రయాణిస్తున్న మరో ఐదుగురికి కాళ్లు, చేతులు విరిగినట్లు తెలిసింది. డీసీఎం డ్రైవర్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోవడంతో స్థానికులు, పోలీసుల సాయంతో బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారిని నల్లగొండలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. క్షతగ్రాతుల వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

జూదరుల అరెస్ట్

ఆలేరురూరల్: పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈఘటన ఆలేరు మండలం శర్బనాపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. అందులో ఇద్దరు తప్పించుకున్నారు. నిందితుల నుంచి రూ.4వేల నగదు, 5 బైక్‌లు సీజ్ చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటశ్రీను తెలిపారు.

నాగార్జునసాగర్: నందికొండ పైలాన్‌కాలనీలోని ఏఈ 29 క్వార్టర్‌లో ఆదివారం రాత్రి పలువురు పేకాట ఆడుతుండగా విజయపురి టౌన్ పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేసినట్లు తెలిసింది. వారి నుంచి రూ.92వేల నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

శ్రావణం.. శుభప్రదం

- పండుగలు, విశేష పర్వాలు, శుభ కార్యక్రమాలకు నెలవు
- గ్రామాల్లో మొదలుకానున్న బోనాల ఉత్సవాలు
- నేటి నుంచి 7వ తేదీ వరకు యాదాద్రిలో ఆండాళ్ అమ్మవారి తిరు నక్షత్ర వేడుక

యాదగిరిగుట్ట, మిర్యాలగూడ టౌన్ : హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసానికి ప్రత్యేక స్థానం ఉంది. వివాహాది శుభకార్యాలకు అనువైన మాసం. నేటి నుంచి (సోమవారం) సెప్టెంబర్ 3 వరకు శ్రావణమాసం కొనసాగనుంది. నెల రోజుల పాటు శ్రీవరలక్ష్మి అమ్మవారికి పూజలు చేయడంతో పాటు మహిళలు వ్రతాలు ఆచరిస్తారు. వివాహాలు, గృహ ప్రవేశాలు, నిశ్చితార్థాలు, శంకుస్థాపనలు, వ్యాపార ప్రారంభోత్సవాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం, విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఈ మాసంలోనే అధికంగా నిర్వహిస్తారు. ఆషాఢంలో లష్కర్‌లో బోనాల జాతర ఉంటే.. గ్రామీణ ప్రాంతాల్లో శ్రావణ మాసంలో అమ్మవార్లకు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇక యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాలు ముస్తాబు చేశారు.

ఈ రోజుల్లో సుముహూర్తాలు..

ఆషాఢ మాసానికి ముందు మూడు నెలలు, శ్రావణ మాసం తరువాత కార్తీక మాసం వరకు ముహూర్తాలు లేకపోవడంతో ఈ మాసంలోనే శుభకార్యాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల 8, 9, 11, 16, 18, 22, 23, 24, 28వ తేదీల్లో శుభ కార్యక్రమాలకు అనుకూలంగా ఉన్నాయని అర్చకులు చెబుతున్నారు. ఈ ముహూర్తాల్లో వివాహాది శుభకార్యాలు, గృహప్రవేశాలు నిర్వహించుకునేందుకు పలువురు సిద్ధమవుతున్నారు.

శ్రావణ మాసం ఎంతో పవిత్రమైనది



శ్రావణ మాసం ఎంతో పవిత్రమైనది. నెల రోజుల పాటు మహిళలు అమ్మవారిని కొలుస్తూ ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ మాసంలోనే శుభకార్యాలకు మంచిగా భావించి, చాలా మంది వివాహాలు చేయడంతో పాటు గృహ ప్రవేశాలు చేస్తుంటారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే శ్రావణ మాసం మొదటి రోజే యాదాద్రి ఆలయంలో ఆండాళ్ అమ్మవారి తిరు నక్షత్ర వేడుకలను ప్రారంభిస్తారు.

– మంగళగిరి నర్సింహమూర్తి, యాదాద్రి దేవాలయ ముఖ్య అర్చకులు

ప్రారంభం కానున్న తిరు నక్షత్ర వేడుక

యాదాద్రి ఆలయంలో సోమవారం నుంచి ఆండాళ్ అమ్మవారి తిరు నక్షత్రం వేడుక ప్రారంభం కానుంది. నేటి సాయంత్రం ఆలయంలో తొళక్కంతో ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు అమ్మవారికి సేవ కాలం జరిపించి, పాశురాలను పఠిస్తారు. బుధవారం రోజు తిరు నక్షత్ర వేడుకలను పురస్కరించుకొని అమ్మవారికి విశేష పాశురాలను పఠిస్తారు.

ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు



తులసికి స్వీటు తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణంలోని రాఘవేంద్ర కాలనికి చెందిన చింతల వెంకన్న, లక్ష్మి దంపతుల కుమార్తె తులసి పట్టుదలతో చదివి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. కట్టంగూర్ మండలం కలిమెర గ్రామానికి చెందిన వెంకన్న 30 ఏళ్ల క్రితం నల్లగొండకు వచ్చి స్థిరపడ్డాడు. వృత్తి రీత్యా ఇస్త్రీ పని చేస్తూ తన ఇద్దరు కూతుళ్లు, కుమారుడిని చదివిస్తున్నాడు. కుమార్తె తులసి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ చదువుతూ గ్రూప్–1 పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయి మెయిన్స్‌కు సిద్ధమవుతోంది. తాజాగా ఏఈఈ, ఏఈ, గ్రూప్–4, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించింది. ఈమె చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించింది. జేఎన్టీయూహెచ్, ఉస్మానియా యూనివర్సిటీల నుంచి గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్టాలు పొందింది.

చెర్వుపల్లి వాసికి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు



మద్దికుంట్ల కీర్తిరెడ్డికి స్వీట్ తినిపిస్తున్న తల్లి రాజేశ్వరి

నల్లగొండ రూరల్: మాడ్గులపల్లి మండలంలోని చెర్వుపల్లి గ్రామానికి చెందిన మద్దికుంట్ల కీర్తి రెడ్డి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. ఆమె ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తి చేసింది. మున్సిపల్ పబ్లిక్ హెల్త్ విభాగంలో ఏఈఈగా, టీపీబీఓ ఏఈ, గ్రూప్ –4 ఉద్యోగాలు సాధించింది. కీర్తిరెడ్డి తండ్రి జానారెడ్డి పోలీస్‌శాఖలో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు.

అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

గరిడేపల్లి: శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో పాలిటెక్నిక్ డిప్లొమా అడ్మిషన్లకు విద్యార్థులు నేరుగా గడ్డిపల్లి హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ నెల 5, 6 తేదీల్లో విద్యార్థులు పదో తరగతి మెమో, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

చోరీ చేసిన వ్యక్తిపై కేసు

నాంపల్లి: మండలంలోని పస్నూర్ గ్రామంలో శుభం ఫంక్షన్‌హాల్‌లో ఎలక్ట్రిక్ సామగ్రి చోరీకి పాల్పడిన ఓ వ్యక్తిపై ఆదివారం కేసు నమోదైంది. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఫంక్షన్ హాల్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న గ్రామానికి చెందిన పంబాల వంశీ ఎలక్ట్రిక్ సామగ్రి చోరీ చేశాడు. ఈమేరకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.

నిషేధిత గుట్కాలు పట్టివేత

వలిగొండ: సుమారు రూ.30 వేల విలువ గల గుట్కాలను ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. వలిగొండలోని గులామ్ సైదాని పాన్‌షాపులో గుట్కాలను విక్రయిస్తున్నాడని వచ్చిన సమాచారం మేరకు ఆదివారం షాపులో తనిఖీ చేశారు. వివిధ కంపెనీలకు చెందిన గుట్కా ప్యాకెట్లు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని, షాపు యాజమాని గులామ్ సైదాని పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్‌లాల్ తెలిపారు.

• సాగర్‌లో పర్యాటకుల సందడి



నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారడంతో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సాగర్ అందాలను ఆస్వాదిస్తూ లాంచీలో జలాశయంలో విహరించారు. – నాగార్జునసాగర్